# లక్కీ కపుల్

-కె. కె. రఘునందన

ఎప్పుడూ ఎత్తే వీరావేశంతోనే ఊగిపోసాగాడు విష్వక్సేనరావు. ఎడా అంటే పెడా అని వాదించటంలో తనూ దిట్టేనని నిరూపించుకుంటున్నది యోగేశ్వరి.

ఇద్దరి మధ్య పొత్తు ప్రశ్నే లేని విధంగా యుద్ధం ప్రచ్ఛన్నంగా సాగుతూంది. ఇది వారికి కొత్తా కాదు. వినేవారికి పాతా కాదు.

ఒకటికి పది రెట్టించే యోగేశ్వరికీ, ఎడ్డెమంటే తెడ్డెమనే విష్వక్సేనరావుకి ఎలా యోగింగి ముడిపడిందో అనంతాశ్చర్యమే!

ఆ జంట వాదులాటలో తంటాలు పడ్తున్న దుర్భర క్షణాన ఫోన్ మ్రోగింది.

విసుక్కుంటూనే ఫోనెత్తింది.

"ఎవరో చెప్పి తగలడండి..." కరుగ్గా అంది యోగేశ్వరి.

అవతల నుండి ఎవరు ఏమిటి సంభాషిస్తున్నారో తెలిసి ఛావటంలేదు విష్వక్సేనరావుకి.

అయితే క్షణ క్షణానికి భార్య యోగేశ్వరి మోమున ఆకస్మికంగా ఆనందాలు దోబూచులాడ్డం, వేటకుక్కలా పసిగట్టాడు విష్వక్సేనరావు.

ఫోన్ పెట్టేసి యిటు తిరిగింది యోగేశ్వరి.

ఒక్క విజిల్ వేయటమే తరువాయి.

"ఏంటి అంత రెచ్చిపోతున్నావు?... ఏం జరిగిందని అంత పొంగు..." నిందిస్తున్నట్లే అడిగాడు విష్వక్సేనరావు.

అంతవరకూ ధుమధుమలాడుతున్న మొహంలో కొనసాగుతున్న విచిత్ర కాంతి... ఆనందతాండవాలకి అర్థం తెలీక అగమ్యంలో కొట్టుమిట్టాడాడు.

"చెబుతావా! చెప్పవా!? అకాలంలో వర్షంలా... నీ సంబరాలకి అర్థం ఏమిటి?" నిలదీసి అడిగాడు విష్వక్సేనరావు.

"ఏమండీ! మనం ఎంత కొట్టుకులాడినా భార్యాభర్తలం ఔనా కాదా?" చెప్పలేనంత సంతోషంగా అన్నదామాట.

"ఆఁ అయితే!"- ఇంకా విసుగే.

"అందుకే మనకు అదృష్టయోగం పట్టబోతున్నదండీ!" అని వెర్రిగా అరిచినంత పని చేసింది.

"ఆఁ అదృష్టయోగమా!?" కళ్ళింతవి చేసుకుని అడిగాడామాట.

"ఔనండీ! మనం తంతే బూర్లె గంపలో పడ్డామండీ!" మళ్ళీ అదే పిచ్చి ఆనందం కొనసాగింపు.

"నీ డొంక తిరుగుడు ఆపెయ్! తిన్నగా చెప్పేడువ్!" బోధపడక తంటాపడ్తున్న వైనం ప్రస్ఫుటించింది అతనిలో.

"చెప్పాక ఏడవాల్సిన ఖర్మ నాకు లేదు... మనం.. మనం 'లక్కీ కపుల్'గా సెలక్టయ్యామండీ.'"

"లక్కీ కపుల్‌గా సెలక్టవటమేంటో..!" విసుగ్గానే అడిగాడు.

"ఎవరో ట్రస్టు ఛైర్మన్ ఫోన్ చేసారు. వారి సర్వేలో మనం లక్కీ కపుల్‌గా తేలామంట. స్టేట్ లెవెల్లో అన్యోన్యంగా ఉండే దంపతులను సెలక్టు చేసి లక్కీ కపుల్‌గా నిర్ణయించారట..." అంది యోగేశ్వరి గొప్పలు పోతూ.

వీరలెవెల్లో ఇల్లదిరేలా నవ్వాడు విష్వక్సేనరావు.

"ఏమిటా పిచ్చి నవ్వులు..." రోషంతో కస్సుమంది యోగేశ్వరి.

"మనది అన్యోన్య దాంపత్యమా... హ్హా..హ్హా... హ్హా.." మరోసారి అదే పకపక.

"జగడాలాడ్డంలో మనదే పైచేయన్న సంగతి ఆ ట్రస్టు వాళ్ళకి తెలీదు కదా... ఏదవనీండి.. మనం లక్కీ కపుల్‌గా సెలక్టయినాం..." భర్త మాటలు భరించలేకపోయింది.

"వచ్చింది బోగస్ ఫోనేమో!" మరో బాంబు వేసాడు.

"మీరు అడ్డుపుల్ల వేస్తారని తెలుసు... కానీ వాళ్ళు ఫోన్ చేస్తూ చెప్పారు... కొరియర్‌లో వివరాలన్నీ పంపిస్తున్నామని..." అతని మాటలను కొట్టిపారేస్తూ అన్నది యోగేశ్వరి.

వంట వార్పుల మాట మరచి కొరియర్ కోసం కాకిలా కాచుకుని కూర్చున్నది.

"కొరియర్" అన్న మాట వినటంతోనే కోతిలా ఛెం గున గెంతుకుంటూ వచ్చి ఎలుగులా మీదపడి పులిలా కవర్‌ను లాక్కుంది యోగేశ్వరి.

ఆమె చేష్టలకి నిశ్చేష్టుడైనాడు కొరియర్ కుర్రాడు.

పద్మిన కవర్ చింపి లెటర్‌ను చదివి పారేసి 'యా హూ!' అంది.

"ఏమిటీ యోగీ! నీ వెర్రి వాలకం?"

"చక చక చదవండి... గబగబ బుర్రకెక్కుతుంది" అని తన మీదకి విసిరేసిన కవర్ అటక మీదకి ఎగిరి పోగా దాన్ని అందుకోవటానికి స్టూలు వేసుకొని ఎక్కి దిగే సమయానికి బొక్కబోర్లా పడిన ఫలితం చిన్నగా బెణికిన కాలుకు 'మూవ్' రాసుకొని ఆనక చదివాడు.

అంతే విష్వక్సేనరావు కళ్ళల్లో ఇక తళుకులే తళుకులు...

"నువ్వంటే ఏమో అనుకున్నా... నిజంగా తంతే బూర్లెగంపలో పడ్డట్టయింది..." ఈల వేయటం తనకూ తెలుసని చాటాడు.

ఆ దంపతులు ఓ అర్ధగంట క్రితం ఒకటే కీచు లాడుకున్న వాళ్ళు మరి ఈనాడు లక్కీ కపుల్!!

సౌభాగ్య ఛారిటబుల్ సంస్థ వారు నిర్వహించిన ఓ సర్వేలో ఎంపికయిన ఓ ఉత్తమ జంట...

అటువంటి జంటలు కొన్నింటికి సమావేశాలు నిర్వహించి, పోటీలు పెట్టి వారికి బహుమతులు ప్రకటి స్తారు.. ఆ బహుమతుల్లో ఖరీదైన పట్టు చీరలు, ఆభర ణాల నుండి విదేశ ప్రయాణాలు, విశాలమైన భవం తుల దాకా ఉన్నాయి.

ఇదీ ఆ కవర్‌లో సారాంశం.

అదే సమయంలో మరోసారి ఫోనొచ్చింది. ఈసారి అందుకున్నది మాత్రం విష్వక్సేనరావే!

"యోగీ! యోగీ! మరేమోచ్చీ, మనం భలే చాన్స్ కొట్టేస్తున్నాం. మనం మీటింగ్‌కి వెళ్ళాలి... గబగబ తయారవు... మీ ఆడాళ్ళసలే చాదస్తం... మనం కుమ్ము కుంటూ బస్సెక్కక్కర్లేదులే... మనల్ని తీసుకు వెళ్ళటానికి ఏసి కారొస్తుంది..."

"ఏంటి నిజ్జంగా..." అంటూ బాత్రూంలోనికి దూరి పోయింది.. సన్నగా హమ్ చేసుకుంటూ...

తరువాత ఎన్నడూ లేని సింగారాలకి పెద్దపీట వేసింది. దాని ఫలితం గంగిరెద్దుకి నమూనా ఆమె.

పదకొండయ్యాక కారొచ్చింది. వైట్ డ్రస్ వేసుకున్న బ్రిటిషు దొరలాగున్న ఒకతను లోనికి వచ్చి– "వెల్‌కమ్ టు లక్కీకపుల్" అని కొద్దిగా వంగి సలామ్ చేసాడు..

విష్వక్సేనరావు, యోగేశ్వరి చెట్టపట్టాలేస్కుని కారెక్కారు.

ఇరవై నిముషాల్లో స్వీట్ స్పాట్ రెసిడెన్సీ – ఫైవ్ స్టార్ హోటల్ ముందాగింది కారు.

కారు దిగి ఇలా అడుగుపెట్టారో లేదో ఓ అంద మైన అమ్మాయి వచ్చి స్వీట్ వాయిస్‌తో సాదరంగా ఆహ్వానించింది. లిఫ్ట్‌లో థర్డ్‌ఫ్లోర్‌లోకి తీసుకెళ్ళింది. వెయిటింగ్ హాల్లో కూర్చోబెట్టింది.

అర్ధగంట దాకా ఎవరి అలికిడి లేని శ్మశాన నిశ్శ బ్దం...

అక్కడికి మరో గంట దాకా ఇబ్బందిగానే కూర్చు న్నారు. అప్పుడు ఇద్దరు యువతీ యువకులు వచ్చి నమస్కారం చేస్తూ "మీ లక్కీ కపుల్‌కి" హార్టీ వెల్‌కమ్.." అని మరో రూమ్‌లోనికి తీసుకెళ్ళి వదిలారు.

తిరిగి వాళ్ళు పోబోతుంటే యోగేశ్వరి ఈ మాయే మిటో బోధపడక... "ఏమిటిదంతా" అనేసింది.

వాళ్ళు స్వీట్‌గా నవ్వేసి – "మీ లక్కీ కపుల్‌కి ఈ రోజు కేటాయించిన రూమ్..." అని రూమ్ తలుపులు వేసుకుని వెళ్ళిపోయారు.

ఆ గదిలో తామిద్దరే ఉండటం... అసలు మను షుల అలికిడే కాకపోవటం... చూస్తుంటే మాత్రం.. మంత్రాల దీవిలో ఉన్నట్లనిపించింది. ఏసిలో ఉన్నా చెమట్లు పట్టేసాయి...

ఆ సందిగ్ధంలో ఉండగానే తలుపు మెత్తగా తెరుచుకుంది. కాఫీ, టిఫిన్స్ వచ్చేసాయి.

వాళ్ళు తమ బ్యాగ్‌లోంచి కొన్ని కాగితాలు ఇచ్చి చదవమన్నారు. అసలే అత్తెసరు మార్కుల్తో చదువుల బండిని ఒడ్డెక్కించిన ఆ 'లక్కీ కపుల్'కి ఆ ఆంగ్ల పద జాలం అస్సలు కొరుకుడు పడలేదు. కాని అర్థం కాలే దంటే ఎకసెక్కాలాడతారని, బోధపడినట్లే బుర్రాడించి మొహంలో కవళికను మెలిద్రిప్పి..

"ఓ.కే. ఓ.కే." అనేసారు.

సంతకాలు చేయమన్నారు వాళ్ళు.

"మీరేం బెదిరిపోనక్కర్లేదు. నోట్లు తయారుచేసి అప్పులు వ్రాయించుకోలేదు లెండి... మీ ఇద్దర్ని 'లక్కీ కపుల్'గా ఎంపిక చేసినట్లుగానూ, మా నిబంధనలకు మీరు బద్ధులై వుంటారన్న అంగీకార పత్రం..." అని నవ్వేసారు.

సంతకాలు చేసి కాగితాలు తిరిగి ఇచ్చేసారు.

"ఈ రాత్రి మీరు గడిపాక ఉదయం నుండీ సమా వేశాలు, పోటీలు ఉంటాయి. రేపు సాయంత్రానికి మీరు ఇంటికి వెళ్ళవచ్చు.." అని ఓ నవ్వు నవ్వేసి వెళ్ళి పోయారు.

తిరిగి మరల రాత్రి తొమ్మిది గంటల దాకా బిక్కు బిక్కుమంటూనే గడిపారు. అప్పుడు పదహారు వెరైటీ

లతో భోజనం తెచ్చిపెట్టారు.

"యోగీ! ఇదంతా కూడా పరీక్షలో భాగమేమో! వారు పంపిన పదార్థాలేవైనా మిగిలిస్తే మార్కులు పోతాయేమో!" అని లేనిపోని భయాన్ని భార్యలో ప్రవేశ పెట్టాడు విష్వక్సేనరావు.

నిజానికి వారి బుజ్జి బొజ్జల్లో చోటు లేకపోయినా, అలనాటి బకాసురుని తమలో ఆవాహన చేసుకుని మెక్కారు. ఆనక కుంభకర్ణుడికి వారసులైనారు.

మరల 'వెరీ వెరీ గుడ్మార్నింగ్' అంటూ బెడ్ కాఫీతో సుప్రభాతం పాడేదాకా తెలివి లేదు.

మొద్దు నిద్ర పోయినందుకు మార్కులు గాని పోవుగదాని బెంగపడి పోయారా దంపతులు.

స్నాన పానాదుల అనంతరం మీటింగ్ హాలుకి దగ్గరుండి మరీ తీసుకుని వెళ్ళారు.

అక్కడ ముప్పై జంటలు హాజరైనాయి. సినిమా సెట్టింగ్ మాదిరి అద్భుతంగా అనిపించిందా మీటింగు హాలు.

సౌభాగ్య ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ త్రైలోక్యరావు గొంతు సవరించుకున్నాడు.

"అన్యోన్య దంపతులకి మనసారా స్వాగతం!! ముఖ్యంగా మానవ సంబంధాలు మృగ్యమౌతున్న వేళ... అన్యోన్య దాంపత్యానికి తార్కాణమే కనుమరుగవుతున్న ఈ రోజు.. ఆ దారుణ పరిస్థితి ఎరిగిన మా సౌభాగ్య ఛారిటబుల్ సంస్థ అది భరించలేక... అసలీ ప్రపంచంలో కొందరైనా సఖ్యత కలిగి ఉండకపోరన్న దృష్టితో ఓ సర్వేలో జరిపింది. ఆ స్టేట్ వైడ్ సర్వేలో సెలక్టయిన జంటలు మీరే! ఇదివరలో కూడా ఓ బ్యాచ్‌నిలాగే ఎంపిక చేసాం. మీ 'లక్కీ కపుల్' అందరికీ కూడా కాంపిటేషన్స్ నిర్వహిస్తాం... తదుపరి ప్యాకేజీల ప్రకటన ఉంటుంది... చివరగా బంపర్ ప్రైజుకి అర్హత నెవరు పొందిందీ గోప్యంగా వారికే తెలియచేయబడ్తుంది. వారు ఇతరులతో ఆ విషయం ఏ మాత్రం ప్రస్తావించినా వారి ప్రైజు క్యాన్సిల్ చేయబడుతుంది. దీనికి మీరంతా అంగీకరిస్తే మా ప్రక్రియ ప్రారంభిస్తాం" అని అందరి వైపు ప్రసన్నంగా చూశాడు.

అదే సమయంలో అందరికీ జ్యూస్‌లొచ్చాయి. హాయిగా త్రాగేసి ఏకగ్రీవంగా బుర్రూపేసారు.

"మీకు మా థాంక్స్! మేం కాంపిటీషన్స్‌లో తొలి మెట్టుగా మీ లక్కీ కపుల్‌కి 'చూపులు కలసిన శుభవేళ' అనే అద్భుతమైన పోటీ పెడ్తున్నాం.. దీనికి మిసెస్ సంధ్యారాజ్ గారి పర్యవేక్షణ. అందువల్ల మీరు ఒకరొకరే జంటల వారీగా ఎదురెదురుగా కూర్చోవాలి. అప్పుడు మీరు మీ చూపుల్లో అనురాగం, ఆప్యాయతలను ముమ్మరంగా కురిపించుకోండి... ఎవరి చూపుల్లో అనురాగం శాతం అధికంగా ఉన్నదో పసిగట్టి, ఆ జంటకు మాంచి ప్రైజు అందజేస్తాం..." అని త్రైలోక్యరావు వివరించాడు.

అందరిలో బీరు పొంగినట్లు ఉత్సాహం...

నిజానికి అందులో ఎందరు అన్యోన్యంగా ఉంటున్నారన్నది పెద్ద ప్రశ్నే... అయినప్పటికీ ఎక్కడ్లేని మందహాసాలు ఎరువు తెచ్చేస్కుని ఆప్యాయతలను అమాంతం కళ్ళల్లోకి రప్పించేస్కుంటున్నారు.

ఈ పోటీ పది నిముషాలు సాగింది.

యోగేశ్వరికి, విష్వక్సేనరావుకీ ముళ్ళమీదున్నట్లే అనిపించింది. అదే సమయంలో బజర్ మోగింది. ఎవరి సీట్లలో వారు సర్దుకున్నారు.

"మీలో చాలా ఉత్కంఠగా ఉంది కదూ! మా పర్యవేక్షణలో జడ్జిమెంట్ జరిగింది... మీలో సున్నితంగా, లాలిత్యంగా అసలు సిసలు దంపతుల్లా ప్రవర్తించిన వారు ఎవరంటే... హనుమాన్లు, కుముదమ్మ... కమాన్ క్లాప్స్... హనుమాన్లు ఫ్రం బనగానపల్లె..., రావాలి క్విక్..." అనగానే స్టేజి మీదకి వచ్చిన 'లక్కీ కపుల్'కి గిఫ్ట్ హ్యాంపర్‌ను అందచేసారు.

అందులో ఖరీదయిన సూట్, ఓ పట్టుచీర, ఐదు వేల రూపాయల నగదు ఉన్నది.

"మిగిలిన వారు నిరుత్సాహపడనవసరం లేదు. మీ అందరికీ తలో గిఫ్ట్ హ్యాంపర్ ఇవ్వబడ్తుంది" అని తలో ప్యాకెట్ అందించాడు త్రైలోక్యరావు, సంధ్యారాజ్.

తరువాత హనుమాన్లు జంటకి అభినందన.. అప్పుడే 'చూసుకున్నప్పుడు కలిగిన అనుభవాలు' చెప్పమన్నారు.

వాళ్ళిద్దరూ సిగ్గుతో మెలిదిరిగి పోయారంటే నమ్మండి.

నెక్స్ట్ అయిటమ్... 'స్వీట్ డ్రీమ్స్' కాంపిటేషన్..

"మీకు ఓ గమ్మత్తయిన పోటీ... మీరు ఈ మధ్య కాలంలో కన్న ఓ చక్కనైన స్వీట్ డ్రీమ్‌ను ఈ స్టేజి మీద కొచ్చి అందంగా చెప్పాలి..."

చాలామంది స్టేజి ఫియర్‌తో ముందుకు రాలేదు. మిగిలిన వారిలో ఓ జంట ముందుకు వచ్చింది. వాళ్ళే ఉదయవర్లు, పేరిందేవి...

'తాము ఒకరోజు వింధ్యాటవిలో విహరిస్తుండగా ఓ రాక్షసుడు తమను ఎదుర్కోడానికి సిద్ధపడితే అతనితో

పోరు సలిపి మట్టి కరిపించామని, ఆ రాక్షసుడు మాయమై ఆ స్థానంలో ఓ మహర్షి ప్రత్యక్షమైనాడని, ఆయన ఇచ్చిన వరంతో స్వర్గప్రవేశం చేసి ఆనందాలు చవి చూసామని" వర్ణించుకొచ్చారు.

తరువాత యోగేశ్వరి స్టేజెక్కింది... ఏవేవో చిలవలు పలవలుగా అల్లి కలంటూ రాకపోయినా వచ్చినట్లుగా అభూత కల్పనలు చేస్తూ మరీ చెప్పింది.

అది విన్న - సాక్షాత్తు భర్తగారయిన విష్వక్సేనరావే తీవ్ర దిగ్భ్రమలో పడిపోయాడు.

అలా మరో నాల్గు జంటలు తమ కలలను సొంపుగా అందరి చెవుల్లో ఒంపారు.

"స్వీట్ డ్రీమ్స్ విన్నర్స్ రిజల్ట్స్.. ఎవరెవరాని ఎదురు చూస్తున్నారా!.. చెప్పేస్తున్నాం... చెప్పేస్తున్నాం... యోగేశ్వరి, విష్వక్సేనరావు.. ఫ్రం విజయనగరం.. నెల్లిమర్ల మండలం... క్లాప్స్... రావాలి... గిఫ్ట్ హ్యాంపర్ అందుకోండి. కమాన్ సంధ్యారాజ్ అందమైన స్వరం అందరినీ ఉత్తేజపరచింది. ఫోటోలు క్లిక్‌మన్నాయి.. వీడియో కన్ను ఉండనే వుంది.

యోగేశ్వరి పట్టపగ్గాల్లేని ఆనందాల్లో మునిగిపోయింది.

లంచ్ టైమ్ ప్రకటించారు.

అప్పుడే పరస్పర పరిచయాలకి వీలైంది.

ఈసారి ఇరవై నాలుగు వెరైటీలతో విందు... నోరూరించే పదార్థాలు... చూస్తుంటేనే కడుపు నిండిపోతుంది.

"డియర్ ఫ్రెండ్స్..." అనంగానే అటుతిరిగారంతా...

"మేం మీకు తెలీకుండానే ఓ కాంపిటేషన్ నిర్వహించాం. అందులో విజేతల పేర్లు కొద్ది క్షణాల్లో ప్రకటిస్తాం. ఆ అవార్డు పేరు ఉత్తమ విందు జంట..." టేబిల్ మేనర్స్ పాటిస్తూ ఒకరికొకరుగా ముచ్చట్లాడుతూ... చాలామట్టుకు అయిటమ్స్ పూర్తిచేసిన ఆ జంటకు ముందుగా మా కంగ్రాట్స్... మీకు మీరే వారెవరై ఉంటారో ఊహించుకోండి చూద్దాం..." అని ట్రస్టు చైర్మన్ అందరివైపు చూసాడు.

ఐదు నిమిషాల అనంతరం - సంధ్యారాజ్ గొంతు విప్పింది.

"ఉత్తమ విందు జంటగా... శ్రీ వల్లభాచార్యులు - నాగమణి క్లాప్స్... కమాన్... ఈ గిఫ్ట్ హ్యాంపర్ అందుకోండి" అని తనూ చప్పట్లు కొట్టింది.

హుషారుగా స్టేజిమీదకి వెళ్ళారు వల్లభాచార్యులు దంపతులు. "వేళ్ళు నాక్కొని తినడ్దంటే విన్నారు కాదు" విసుక్కుంది యోగేశ్వరి భర్త విష్వక్సేనరావుతో.

"లక్కీ కపుల్ అందరికీ మధ్యాహ్నం సెక్షన్‌లోకి స్వాగతం... ఈరోజు మేం నిర్వహించిన కాంపిటీషన్స్ గాని, ప్రకటించిన బహుమతులు గాని మీకు ఎంతో సంతృప్తినిచ్చాయనుకుంటున్నాం... అయితే లక్కీకపుల్‌గా ఎన్నికయిన జంటలందరికీ మా ఆకర్షణీయమైన ప్యాకేజీలు ప్రకటిస్తాం... వారికి ఏది కావలిస్తే దాన్ని సెలక్టు చేసుకోవచ్చు... మొదటిది.. సింగపూర్ ప్రయాణం.. రెండవది నగరం నడిబొడ్డున మాంఛి భవంతి... అయితే ఈ రెండు ప్యాకేజిలలో ఏదో ఒకదానిలో చేరిన వారికి చివర్లో బంపర్ ప్రైజులుంటాయి. మీరు లక్కీ కపుల్‌గా ఉంటూ ఏ ప్యాకేజికి ఇష్టపడకపోతే బహుమతులకు అర్హులవరు. విదేశ ప్రయాణానికయితే ఫార్మాలిటీస్ నిమిత్తం ఒక్కో జంట ఏభై వేలు డిపాజిట్ చెల్లించాలి... ఇంటి గురించయితే నలభై వేల రూపాయలు. ఈ డిపాజిట్స్ ఈ పథకాలు పూర్తయినాక తిరిగి చెల్లించబడతాయి. మీరు దేనికి ఇష్టపడ్తున్నదీ మా అప్లికేషన్ ఫారంలో వ్రాయండి" అని ఫారాలు పంచాడు త్రైలోక్యరావు.

జంటలన్నీ గుసగుసలాడాయి.

తమకు ఇల్లెలాగూ ఉంది కాబట్టి సింగపూరే బెటరని భావించారు యోగేశ్వరి, విష్వక్సేనరావు.

"మీకు మా మీద అపనమ్మకం ఉండచ్చు. కాని లోగడ మేం కొన్ని బ్యాచ్‌లను ఏవిధంగా డీల్ చేసిందీ మీకు మా వీడియో షో ద్వారా ఎగ్జిబిట్ చేస్తాం... చూడండి.." ఆ మాటతో అన్ని జంటలు టి.వి. మీదకు దృష్టి సారించాయి.

"అదిగో... వాళ్ళంతా తొలి బ్యాచ్‌లో విన్నర్స్. ప్రసిద్ధ చైనా రచయిత్రి 'చాంగ్' చేతిలోంచి గిఫ్టందుకుంటున్న జంట మిత్రవింద, సద్గుణరావులు.. అదిగో చూడండి.. 'హెల్దీ కపుల్'కి డాక్టర్ చెకోవ్‌గారు 'చెక్' అందిస్తున్నారు. ఇంక క్యాండిల్ లైట్ డిన్నర్ ఎరేంజ్‌మెంట్... సింగపూర్‌కి విమానం ఎక్కుతున్న జంటలు... చివరిగా బంపర్ ప్రైజును దక్కించుకున్న లక్కీ కపుల్ ఈశ్వర్జీ, నిర్మల..." ఒక్కో దృశ్యం విడమరచి చెబుతున్నాడు చైర్మన్.

"ప్రత్యక్షంగా చూసారుగా... మీరు మమ్మల్ని విశ్వసిస్తే... వెంటనే మా ప్యాకేజిలను సెలక్ట్ చేసుకొని డిపాజిట్స్ చెల్లించండి... దీనిపై మీ అభిప్రాయాలు చెప్పవచ్చు..." అన్నాడు.

తలొకరు తలోరీతిగా చెప్పినా అందరికీ వారి మాట వేదవాక్కే!

"మీ అందరూ అనుమతించినందుకు థాంక్స్... దయచేసి వెంటనే మీరు మాకు డిపాజిట్ చెల్లించి సహకరిస్తే... మా ఏర్పాట్లలో మేం ఉంటాం" సంధ్యా రాజ్ స్వీట్ వాయిస్‌తో మరోసారి చెప్పింది.

అందరూ ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళారు. ఇంటికి చేరిన యేగేశ్వరి గిఫ్ట్ హ్యాంపర్ విప్పి చూసి గెంతులేసింది. పట్టు చీర... సూట్ కాకుండా రెండు వేలకు చెక్...

"ఏమండీ! మనం ఎలాగైనా సింగపూర్ ప్రయాణానికి సిద్ధమవుదామండీ..." ఒత్తిడి తెస్తూ యోగేశ్వరి అంది.

మనం లక్కీ కపుల్‌గా సెలక్టవటమే ఓ గొప్పనుకుంటే... విదేశీ ప్రయాణం మరీ గొప్ప కాదూ "– తమిద్దరిదీ ఏకాభిప్రాయం అనుకుంటూనే వెంటనే బ్యాంకుకెళ్ళి ఏభైవేలు విత్‌డ్రా చేసుకు వచ్చాడు.

తరువాత ఫోనొచ్చింది.

"లక్కీ కపుల్‌కి నమస్కారాలు... మీరు మా ప్యాకేజిని ఇష్టపడితే వెంటనే చెల్లించండి... ఇప్పటికే చాలా మంది మాకు కట్టేసారు. మీరు ఊఁ అంటే ఏసి కారు పంపిస్తాం..." అన్నాడు చైర్మన్.

"అలాగే సార్! మేము రెడీయే!" అని అంగీకారం తెలిపాడు విష్వక్సేనరావు.

ఓ పదినిమిషాల్లో కారొచ్చింది.

డబ్బు పట్టుకుని వెళ్ళి కట్టేసి తిరిగి అదే కార్లో వచ్చేసాడు.

ఇది జరిగిన ఐదో రోజున కొరియర్‌లో ఓ లెటర్ వచ్చింది. వివరాలు చదివాడు విష్వక్సేనరావు.

"యాహూ! మనకు బంపర్ ప్రైజా..." అని వీరానందంతో చిందులేసింది.

మరో గంటకు ఓ శాల్తీ కార్లో వచ్చి– "అయామ్ స్వరూప్ ఫ్రం సౌభాగ్య ఛారిటబుల్ ట్రస్ట్... మీకు బంపర్ ప్రైజ్ వచ్చిందిగా... దానికి సంబంధించిన కాగితాలు తెచ్చాను. కాస్త సంతకాలు చేస్తే వెళ్ళిపోతాను..." అని వినమ్రంగా నమస్కరించి తన ఐడెంటిటీ కార్డు చూపించాడు.

అతనిచ్చిన కాగితాలు క్రింద – మీద చూసి సంతకాలు చేసారు.

"చిన్న రిక్వెస్ట్... మీకు ఈ బంపర్‌ప్రైజు వచ్చిన విషయం ఎవరికీ తెలియచేయొద్దు... మీరు బహుమతిని తీసుకోవటానికి ముందుగా చిన్న నిబంధన... మీరు కట్టిన ఏభైవేలు కాక మరో పదివేలు కట్టాల్సి ఉన్నది. ఇది మీ బంపర్ ప్రైజు వారికి మాత్రమే" అని ఇద్దరి కళ్ళల్లోకి చూసాడు.

భార్యాభర్తలు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. "మీకు ఇష్టం లేకపోతే ప్రైజు మరొకరికి ఆఫర్ చేస్తాం..." నిర్మొహమాటంగా అన్నాడు స్వరూప్.

యోగేశ్వరి కనుసైగతో లోనికి వెళ్ళి పదివేలు తెచ్చి ఇచ్చేసాడు విష్వక్సేనరావు...

వెంటనే బ్యాగు సర్దుకుని "మీకు ఫోన్ చేయంగానే రండి. బంపర్ ప్రైజు తీసుకుందురు గాని..." అని వెళ్ళిపోయాడు.

ఆ మాటకు తీయని ఊహలలో తేలిపోయిన ఆ లక్కీ కపుల్ ఫోనొస్తుందని తెగ ఎదురు చూసారు. అనుమానంతో కొట్టుకులాడారు. చివరికి స్వీట్ స్పాట్ రెసిడెన్సీని చేరారు.

ఆ సరికే ఎన్నో జంటలు గుమిగూడాయి.

ఆ హోటల్ వాళ్ళు వీరందరినీ చూస్తూ 'ఎవరూ ఇక్కడ లేరని, తమకి సంబంధం ఎంతమాత్రం లేదని చెప్పి తరిమేసారు.

అందరూ తమకు వచ్చిన బంపర్ ప్రైజు కాగితాలను ఒకరికొకరు చూపించుకున్నారు.

ఘొల్లుమన్నారు. అయినా చేసేదేముంది "గోవిందా గోవిందా..."

○ ○ ○

'లక్కీకపుల్ పేరుతో మధ్య తరగతి ప్రజలకు కుచ్చు టోపీ' అన్న వార్తను ప్రముఖ పత్రికలన్నీ వ్రాసాయి.

"ఈ మధ్య కాలంలో కొందరు ఘరానా మోసగాళ్ళు హైటెక్ పద్ధతిలో వంచనకు పాల్పడి ప్రజలను కొల్లగొట్టి కోట్లకు పడగలెత్తి మకాం ఎత్తేస్తున్నారు. ఇప్పటికే చాలామంది వారి చేతిలో తీవ్రంగా నష్టపోయారు."

ఉదయాన్నే పేపర్లో వార్త చదవటంతోటే యోగేశ్వరి పెద్దపెట్టున ఏడ్చేసింది.

"అంతా మీ వల్లే జరిగింది" అని కస్సునలేస్తూ.

"ముందు వెనుకలు చూడకుండా గెంతులేసింది నువ్వే!" రోషంగా అన్నాడు విష్వక్సేనరావు.

"లేదు మీరే..."తెయ్యిమని జట్టీకి దిగింది యోగేశ్వరి.

ఆ 'లక్కీ కపుల్' మధ్య యుద్ధం ఎప్పటి మాదిరిగానే..

పాపం; పూర్ ఫెలోస్!! ■